ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం 9
అక్టోబర్ 2025





# ఎస్సీ, ఎస్టీ స్టూడెంట్స్ పై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష ...!!

**దళితుడు ఆర్థిక మంత్రి అయినా దళితుల బిడ్డల చదువుకు నిధులు ఇవ్వరా...?!**

**బెస్ట్ అవైలబుల్ స్కీమ్ పట్ల శీత కన్ను ఎందుకు...!**

**నిధులు ఇవ్వనప్పుడు పాఠశాలల్లో తమ బిడ్డలను ఎందుకు చేర్పించారని నిలదీస్తున్న తల్లిదండ్రులు**

**స్టూడెంట్స్ డాటా పై రంగంలోకి ఇంటలిజెన్సీ విభాగం పోలీసులు**

**రాష్ట్రమంతట భగ్గుమన్న బిఏఎస్ స్కూల్ పేరెంట్స్ ఆందోళనలు**

**విద్యార్థి సంఘాల మద్దతుతో ఉద్యమం తీవ్రతరం**



**హైదరాబాద్, రోమింగ్ న్యూస్:** ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉపకార వేతనాలను ఇచ్చేందుకు పచ్చ జెండా ఊపిన ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ పేద విద్యార్థుల కోసం ఉద్దేశించిన బెస్ట్ అవైలబుల్ స్కీంకు నిధులు విడుదల చేయకపోవడం పక్షపాత ధోరణికి పరాకాష్టగా ఈ వర్గానికి చెందిన పేరెంట్స్ అభిప్రాయపడుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి పక్కాగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అన్యాయం చేస్తున్నారని... పేరెంట్స్ దుమ్మెత్తి పోస్తున్నారు. దళితుడు భట్టి విక్రమార్క ఆర్థిక మంత్రి అయినప్పటికీ ఆయన తమ పిల్లల భవిష్యత్తును ఆగం చేస్తున్నారని... దళిత బిడ్డల తల్లిదండ్రులు పుట్టెడు దుఃఖంతో కుమిలిపోతున్నారు. ఇటు బెస్ట్ అవైలబుల్ స్కీమ్ లో తమ బిడ్డలను సెలెక్ట్ చేశారు... వారికి విద్యాబుద్ధులు చెప్పి భవిష్యత్తును బంగారు మయం చేయడానికి అవసరమైన నిధులను మాత్రం ఇవ్వడం లేదు... ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు మూడేళ్ల నుంచి ఎక్కడి నుంచి తెస్తారూ? ఎందుకని వారిపట్ల కక్ష కట్టారు...? ఇప్పటికే వారంతా అప్పుల్లో కూరుకుపోయారు... అని దళిత బిడ్డల తల్లిదండ్రులు కలెక్టరేట్ల ముందు ఆవేదన చెందుతున్న దృశ్యాలు ఇప్పుడు సర్వసాధారణమయ్యాయి.

పాఠశాల విద్యార్థుల విషయంలో ఉదాసీనత వ్యవహరించడం వెనుక వీరి వల్ల ఒరిగేదేముంది... 15 ఏళ్ల లోపు పిల్లలకు ఎలాగూ ఓటు హక్కు ఉండదు కదా...?! వీరి విషయంపై తొందరపడి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఏముంది? అన్న భావన వ్యక్తం అవుతుందని ఎస్టీ, ఎస్టీ విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాస్ స్కీంలో నిధులు మంజూరయ్యేంతవరకు పాఠశాలల యాజమాన్యాలు మా పిల్లలను స్కూలుకు రావద్దు అంటున్నాయి... మీరేమో నిధులు విడుదల చేయడం లేదు మా పిల్లల భవిష్యత్తు ఏమిటి అంటూ వారు సూటిగా ప్రశ్నిస్తున్నారు.

**కార్పొరేట్ విద్యను అందించాలన్న ఉద్దేశంతో...**

కార్పొరేట్ విద్యను అందించాలన్న ఉద్దేశంతో ప్రవేశపెట్టిన బెస్ట్ అవైలబుల్ స్కీం లో చేరిన ఎస్.సీ, ఎస్టీ విద్యార్థుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ అసోసియేషన్ తీసుకున్న నిర్ణయం మేరకు రాష్ట్రమంతటా పిల్లలను పాఠశాలలలోకి రానివ్వడం లేదు. జిల్లా స్థాయి అధికారులు జూన్ నెలలో ఒత్తిడి చేసి పిల్లలను చేర్పించారు. 15 రోజుల్లో మీ బకాయిలను ఇప్పిస్తామని కూడా చెప్పారు. జూలై నెలలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కూడా 15 రోజుల్లో తప్పకుండా నిధులు ఇస్తాం... పిల్లలందరినీ పాఠశాలలకు వెళ్లేలా చూడండి. కొత్తవారిని చేర్పించండి.. అని ఆదేశాలు జారీ చేయడంతో రాష్ట్రంలోని 33 జిల్లాల ఎస్సీ, ఎస్టీ డెవలప్మెంట్ అధికారులు, జిల్లా కలెక్టర్లు ఒత్తిడి చేసి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ లలో విద్యార్థులను చేర్పించారు.

**జూన్ లో ఒత్తిడి చేశారు....నేడు మొహం చాటేస్తున్నారు...!!**

జూన్ నెలలో అడ్మిషన్లు తీసుకోవాలి పుస్తకాలు ఇవ్వాలి బుక్కులు ఇవ్వాలి అంటూ ఒత్తిడి చేసిన జిల్లా కలెక్టర్లు జిల్లా అధికారులు సార్ మాకు నిధులు లేక అప్పుల పాలమవుతున్నామని వినతి పత్రాలు ఇవ్వడానికి వెళుతున్న సందర్భంగా ఆయా జిల్లా కేంద్రాలలో అధికారులు మొహం చాటేస్తున్నారు మేము కూడా ఇలా పరిస్థితి దిగజారుతుందని ఊహించలేకపోయాం. ఎప్పుడైనా మాటిస్తే నిధులు విడుదల చేసేవారు ఇప్పుడు ఇచ్చిన మాటను పట్టించుకోకపోవడంతో మీకు ఏం చెప్పాలో మాకు అర్థం కావడం లేదు. మీరు చేసేది మీరు చేసుకోండి అంటూ అధికారులు బెస్ట్ అవైలబుల్స్ కి పాఠశాలల కరస్పాండెంట్లతో చేస్తున్న చిట్ చాట్ లో కూడా తప్పుకుంటున్నారు.

**ఆందోళన బాటలో బాస్ స్కీం పాఠశాలలు**

తీరా నాలుగు నెలలు గడిచిన నయా పైసా కూడా విడుదల కావకపోవడంతో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ నిర్వాహకులు ఆందోళన బాట పట్టారు. యూనియన్ గా ఏర్పడి ఎక్కడికక్కడ పేరెంట్స్, వివిధ విద్యార్థి సంఘాల మద్దతు తీసుకొని నిర్వహిస్తున్న ఉద్యమం పతాక స్థాయికి చేరుకున్నది. ఇప్పుడు ఏ మండల కేంద్రంలో చూసినా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ విద్యార్థుల ధర్నాలు, రాస్తారోకో లతో అట్టుడికి పోతున్నది. ఈ విషయంపై జిల్లా కలెక్టర్లు, జిల్లా అధికారులతో పాటు పోలీసు ఇంటిలిజెన్సీ వర్గాలు కూడా ప్రభుత్వానికి నివేదికలను ఎప్పటికప్పుడు అందిస్తున్నాయి. ఏకంగా ఇంటలిజెన్స్ వర్గాలు రంగంలోకి దిగి ఏ ఏ పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారు? వారికి ఎంత బకాయి రావాలి? అనే వివరాలను కూడా సేకరించి తమ ఉన్నతాధికారుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పెద్దలకు చేరవేసినట్లు సమాచారం.

**30 వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం**

విద్యలో ప్రతిభ కనబరిచిన ఎస్సీ ఎస్టీ విద్యార్థులు బిఏఎస్ స్కీం కింద ఎంపికై సుమారు 30 వేల మంది విద్యార్థులు పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు. విద్యార్థుల ఫీజును ఉపకార వేతనాలుగా ప్రైవేట్ పాఠశాలలకు చెల్లిస్తూ గత 30 సంవత్సరాలుగా ఈ పథకాన్ని కొనసాగిస్తున్నది. కాగా బిఏఎస్ లో సీటు సాధించి ప్రైవేటు పాఠశాలల్లో విద్యనుభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం మూడేళు ్లగా నిధులు విడుదల చేయకపోవడంతో బాధలు మొదలయ్యాయి. వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా తయారైంది.

**ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు నాడువరం... నేడు సంక్షోభం!!**

ప్రతి ఏటా షెడ్యూల్డ్ కులాల షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ప్రైవేట్ స్కూళ్లలో విద్యార్థులకు ఉచిత విద్యను ప్రభుత్వం అందిస్తున్నది డేస్ కాలర్ కు 28, 000 హాస్టల్ వసతికి 42,000 చొప్పున చెల్లిస్తుంది. ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత విద్య హాస్టల్ సదుపాయం కల్పిస్తూ ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించేందుకు ఆసక్తి చూపుతున్నారు. మంచి ఫలితాలు... మంచి బోధన... మంచి వసతి ఉండడంతో తల్లిదండ్రుల దృష్టి బెస్ట్ అవైలబుల్ స్కూల్ లపై పడింది. తమ పిల్లలు ప్రైవేట్ స్కూళ్లలో చదివితే మంచి ర్యాంకులు వస్తాయని భావించే వారి సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది.

**భట్టి నీకు ఇది తగునా...మూడేళ్ల నుంచి 200 కోట్లు పెండింగ్‌లిన్యాయమేనా?!**

మూడేళ్ల నుంచి రాష్ట్రంలోని 181 పాఠశాలలకు సుమారు 200 కోట్ల రూపాయల వరకు ఫీజు బకాయిలు ఉన్నట్లు రాష్ట్ర అధికారులు తేల్చారు. వీటి రిలీజ్ పట్ల మంత్రి పదవి స్వీకరించిన అల్లూరి లక్ష్మణ్ జూలై నెలలో తీవ్రంగా ప్రయత్నం చేశారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో ఆయన ఈ నిధుల విషయం పైన శ్రద్ధ పెట్టడం లేదు. ఎవరైనా ఆయన దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లినా అంతా భట్టి చేతుల్లో ఉంది... నా చేతిలో ఏమీ లేదు.... అంటూ చేతులెత్తేశారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ బకాయిల విడుదల పట్ల మొదటి నుంచి ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు ఇష్టం లేదనే సమాచారం. ఆయన ఒక దళితుడు అయినప్పటికీ దళితులకు సంబంధించిన నిధులను విడుదల చేయడానికి మనసుపకపోవడం పట్ల అన్ని విద్యార్థి సంఘాల నాయకులు ముక్తకంఠంతో విమర్శిస్తున్నారు. అయినప్పటికీ ఆయన ఇవేవీ పట్టించుకోకుండా తాను పదవి బాధ్యతలు స్వీకరించిన ఈ రెండేళ్ల నుంచి నయా పైసా ఇవ్వకుండా ఇబ్బందులకు కారకుడు అయ్యారని ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నిధులు ఇవ్వకపోతే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ కు వ్యతిరేకంగా పనిచేస్తాం**

బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం 200 కోట్ల రూపాయలు విడుదల చేయడానికి ప్రభుత్వానికి ఇష్టం లేకపోతే 30 వేల మంది విద్యార్థుల తల్లిదండ్రుల తల్లిదండ్రులంతా కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేయడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇంతవరకు ఏ ప్రభుత్వము విద్యార్థుల పట్ల ఇంత కర్కశంగా వ్యవహరించ లేదని జిల్లా కలెక్టరేట్ల ముందు జరుగుతున్న ధర్నాలలో పాల్గొంటున్న పాఠశాలల తల్లిదండ్రులు చెబుతున్నారు. ఒక దళితుడు ఆర్థిక మంత్రి అయినప్పటికీ దళిత విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడం దారుణం అని వారి సందర్భంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా బెస్ట్ అవైలబుల్ స్కీం లో తమ పిల్లలను చేర్పించి వారి జీవితాలతో ఆడుకుంటున్నారని ఒకవైపు అధికారులను మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ పెద్దలను ఎస్సీ ఎస్టీ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు తిట్టిపోసుకుంటున్నారు.

**అన్ని పార్టీల మద్దతు**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కలు బెస్ట్ అవైలబుల్ స్కీమ్ విద్యార్థులకు నిధులు విడుదల చేయకపోవడం పట్ల అన్ని పార్టీల నుంచి నిరసన వ్యక్తం అవుతున్నది. బెస్ట్ అవైలబుల్ స్కూల్ పాఠశాలలకు పిల్లలను రానివ్వకపోవడం పట్ల సంపూర్ణ మద్దతు ఇస్తున్నాయి. ఇప్పటికే టీఆర్ఎస్, బిజెపి పార్టీల నాయకులు ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ కూడా చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు అనేక చోట్ల ధర్నాలు, రాస్తారోకోలకు మద్దతునిస్తూ ప్రభుత్వం మొండి వైఖరి పై నిరసన వ్యక్తం చేస్తున్నారు. మరి కొద్ది రోజుల్లో ఈ ఉద్యమం తీవ్ర స్థాయికి చేరుకొని ఉన్నదని ఇంటలిజెన్స్ వర్గాలు కూడా ప్రభుత్వానికి నివేదికలు అందిస్తున్నాయనీ సమాచారం.






సిపిఐ ఎమ్మెల్యే సాంబశివరావుకు వినతిపత్రం ఇస్తున్న బిఏఎస్ స్కూల్ పేరెంట్స్....



పెద్దపల్లి కలెక్టరేట్ వద్ద బిఎఎస్ పేరెంట్స్ నిరసన



కరీంనగర్ జిల్లాలో నిరసనలు



పరకాలలో ఎస్ఎఫ్ఐ ఆందోళన

